క్లుప్తంగా

కుమార సుబ్రహ్మణ్యేశ్వరునికి భారీగా అభిషేకాలు


స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు గ్రామంలో కొలువై ఉన్న కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం భారీగా అభిషేకాలు నిర్వహించారు. 320 అభిషేకాలు చేయించుకున్నారని అధికారులు తెలిపారు. అర్చకులు కొడమంచిలి సత్యనారాయణ, సన్నిధి రాజు కుమార వెంకట జోగి సుబ్రహ్మణ్యశర్మ స్వామికి అభిషేకాలు చేశారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

రంగంపేట: వర్షాల కారణంగా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా మండలంలోని జి.దొంతమూరు గ్రామంలో మంగళవారం సర్పంచ్ గోలి రమణ ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. వీధులు, డ్రైనేజీలు, మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పిచికారీ చేయించారు. పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యోగాపై శిక్షణ


విద్యార్థులకు యోగా శిక్షణ ఇస్తున్న నాగలక్ష్మి

పెదపూడి: విద్యార్థులు యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్య పొందుతారని లొల్ల గ్రామంలో గల విశ్వమానవత ఆశ్రమం వ్యవస్థాపకుడు అల్లూరి శ్రీనివాసచౌదరి అన్నారు. జి.మామిడాడ శివారు లక్ష్మీనరసాపురంలో గల బాలుర, బాలికల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యోగాపై అవగాహన, శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పల్లపు వీధిలో రామాలయం ఆవరణలో ఉచిత హోమియోపతి వైద్య శిబిరం విశ్వమానవత ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహించారు. యోగా అధ్యాపకురాలు డి.నాగలక్ష్మి విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. డాక్టర్ సత్యనారాయణ అధ్వర్యంలో ఆరు నెలల నుంచి ప్రతి నెలలో రెండుసార్లు ఉచిత హోమియోపతి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు చేశారన్నారు. శిబిరం నిర్వహణకు కర్రి వీర్రెడ్డి, మల్లిడి రామచంద్రారెడ్డి, మాధవి, నల్లమిల్లి సురయమ్మలు సహకారం అందించారన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలి

గోకవరం: గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. మండల పరిధి అల్లవరంలో తరచూ విద్యుత్ కోతలు ఎందుకు చేస్తున్నారని ఉద్యోగులను గ్రామస్తులు నిలదీశారు. కరెంట్ పోవడంతో దోమల కాటుకు గురై అనారోగ్యాల బారిన పడుతున్నమని అవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన అధికారులు చొరవ చూపి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుర్రపు డెక్క తొలగింపు


గుర్రపుడెక్క తొలగిస్తున్న మహేంద్రవాడ ఉపసర్పంచ్ గంగరాజు

అనపర్తి: మండలంలోని మహేంద్రవాడ, కొప్పవరం గ్రామాల మధ్య గల తుల్యభాగ నది (మురుగుకాలువ)లో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న గుర్రపుడెక్కను మంగళవారం తొలగించారు. ఇటీవల కురిస్తున్న భారీ వర్షాలకు పైనుంచి కొట్టుకువచ్చిన వ్యర్థాలు, గుర్రపుడెక్క మహేంద్రవాడ పరిధిలో గల వంతెన వద్ద పేరుకుపోయాయి. నీటి ప్రవాహానికి ఇబ్బందిగా మారడంతోపాటు మురుగు పేరుకుపోయింది. దీంతో గ్రామ ఉపసర్పంచ్ మల్లిడి గంగరాజు స్వయంగా గుర్రపుడెక్కను తొలగించేందుకు పూనుకుని కాలువ ఉధృతంగా ప్రవహిస్తున్నప్పటికీ దానికి లెక్కచేయకుండా మంగళవారం మురుగుకాలువలోకి దిగి తొలగింపు చర్యలు చేపట్టారు. దీనికి గమనించిన స్థానిక రైతులు సైతం కాలువలోకి దిగి గుర్రపుడెక్కను తొలగించారు.

మత్స్యకారులకు శిక్షణ

మధురపూడి: మత్స్యకారులు వ్యాపారంలో లాభాలను ఆర్జించేలా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం శిక్షణా తరగతులను నిర్వహిస్తోందని రాజమహేంద్రవరంలోని రాదాసు సహకార శిక్షణా కేంద్రం సమన్వయకర్త వెదురుపాక శ్రీనివాస్ అన్నారు. కోరుకొండ లంకాలమ్మ దేవాలయం సమీపంలోని ఆర్బీకేలో మంగళవారం మూడు రోజుల శిక్షణ శిబిరం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని డివిజినల్ సహకార అధికారి ఉమాపార్వతి ప్రారంభించారు. మత్స్యశాఖ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ కె.హరీష్, గణేశ్వరరావు, కళ్యాణి పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు

- ప్రతిపక్షాలపై ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ధ్వజం
- వైఎస్సార్ సీపీ శ్రేణులతో సమావేశం


కోరుకొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చేసి ఓర్వలేక ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండలోని శ్రీరస్తు కల్యాణ మండపంలో మంగళవారం పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాల అసత్య ఆరోపణలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు. హింసను ప్రేరేపిస్తున్న చంద్రబాబు నాయుడు నిసిగ్గుగా మాట్లాడుతున్నారన్నారు. నియోజకవర్గంలో రూ.2 వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేశామన్నారు. మండలంలోని కొన్ని గ్రామాలకు చెందిన నాయకులతో సోమవారం మాట్లాడిన ఆయన, మిగిలిన కోటికేశవరం, కోటి, రాఘవపురం, బొల్లెద్దుపాలెం, శ్రీరంగపట్నం, కాపవరం గ్రామాల నాయకులకు మంగళవారం దిశానిర్దేశం చేశారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జక్కంపూడి జనబాట నిర్వహించామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపులో భాగంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా నియోజకవర్గంలో రూ.219 కోట్లతో వాటర్ గ్రిడ్ పథం మంజూరైన సంగతిని వెల్లడించారు. ఈ సందర్భంగా పార్టీ సచివాలయం, జేసీఎస్ సమావేశం నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన కన్వీనర్లను అభినందించారు. అలాగే ప్రజల సమస్యల సాధన, పార్టీ కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం పలువురితో కమిటీని ఏర్పాటు చేశారు. పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ క్రమశిక్షణకు మారుపేరన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కో కన్వీనర్ గణేశుల పోసియ్య, రాజానగరం కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, నాయకులు తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి, కడియాల పాపారావు, గట్టి ప్రసాద్, బొరుసు బద్రి పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత


చైతన్య కుమార్‌కు ట్రై సైకిల్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: తన తండ్రి, దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావు ఆశయాల మేరకు స్థాపించిన ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు, ఎంతో మందికి సహాయ, సహకారాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ప్రకాశం నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఎస్.చైతన్య కుమార్ అనే దివ్యాంగుడికి ట్రై సైకిల్, ఆదిత్య డిగ్రీ కాలేజీలో చదువుతున్న కె.శ్రీధర్‌కు సైకిల్ అందజేశారు. మండలంలోని పాత తుంగపాడులో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో దివ్యాంగుడైన చైతన్య కుమార్ పాఠశాలకు వెళ్లి, రావడానికి పడుతున్న ఇబ్బందులను గ్రామ పెద్దల ద్వారా ఎమ్మెల్యే తెలుసుకున్నారు. ఆ సమయంలో ఆయన ఇచ్చిన హామీ మేరకు మంగళవారం ట్రై సైకిల్ అందజేశారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సేవా సమితి అధ్యక్షుడు గుబ్బల రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు మందారపు వీర్రాజు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో ప్రసవాలు జరపాలి

- డీసీహెచ్ఎస్ డాక్టర్ సనత్‌కుమారి


సమావేశంలో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ సనత్‌కుమారి

అనపర్తి: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా అనపర్తి ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా వైద్యులు, సిబ్బంది దృష్టి సారించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎం.సనత్‌కుమారి ఆదేశించారు. మంగళవారం స్థానిక ఏరియా ఆసుపత్రి పరిధిలో గల రామవరం, కుతుకులూరు, బిక్కవోలు, కొంకుదురు, రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న ఆసుపత్రి వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లతో ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. డాక్టర్ సనత్‌కుమారి మాట్లాడుతూ వంద పడకల ఆసుపత్రిగా స్థాయిపెంపు జరిగిన అనపర్తి ఆసుపత్రిలో ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి ప్రతీ నెలా సుమారు 200 ప్రసవాలు జరగాల్సి ఉందన్నారు. ఏరియా ఆసుపత్రిలో అన్ని మౌలిక వసతులు, సౌకర్యాలతోపాటు అత్యవసర పరిస్థితుల్లో శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు సంబంధిత వైద్యులు అందుబాటులో ఉన్నారని చెప్పారు. వీటిని దృష్టిలో ఉంచుకుని అనపర్తి ఏరియా ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు పీహెచ్‌సీలకు వచ్చే గర్భిణులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి, సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ ప్రమీల, పీహెచ్‌సీ వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వన్య ప్రాణులను వేటాడితే కఠిన చర్యలు


శివరామపట్నంలో వన్యప్రాణి సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న వెంకట్రావు

గోకవరం: వన్య ప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని ఫారెస్టు సెక్షన్ అధికారి పి.వెంకట్రావు అన్నారు. కామరాజుపేట గ్రామ పంచాయతీ, శివరామపట్నంలో రాజమహేంద్రవరం రేంజి అధికారి ఆదేశాల మేరకు వన్యప్రాణి సంరక్షణ చట్టాలపై మంగళవారం గ్రామస్తులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవిలో జీవించే ప్రతి జీవికి సంరక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఎవరైనా అడవి జంతువులను వేటాడినా, ఉచ్చులు పన్నినా, విద్యుత్ తీగలు అమర్చినా వారిపై సెక్షన్ 1972 ప్రకారం శిక్షార్హులన్నారు. జంతువులు గ్రామాల్లోను, పొలాల్లోను సంచరించినట్లు అనిపిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఎస్ఎస్ చైర్మన్ గాబు రాంబాబు, బీటు అధికారులు డి.కామేశ్వరరావు, రాజీరమేష్‌లు ఉన్నారు.

పెదపూడి మండల విభజన జరగదు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పెదపూడి గ్రామస్తులు

అనపర్తి: నియోజకవర్గంలోని పెదపూడి మండల విభజన జరగదని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి స్పష్టం చేశారు. పెదపూడి మండల జెడ్పీటీసీ, పార్టీ మండల కన్వీనర్లు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండలానికి చెందిన పలువురు ప్రముఖులు మంగళవారం అనపర్తి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి పెదపూడి మండలాన్ని విభజించవద్దంటూ వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అర్బన్ మండలాల విభజన అంశం నేపథ్యంలో మండలాల విభజన చర్యలు చేపడితే కాకినాడ జిల్లాకు అతి సమీపంలో ఉన్న పెదపూడి మండలాన్ని శాస్త్రీయంగా విభజన చేయాలన్న ఆలోచనతో ప్రభుత్వానికి లేఖ రాశానని చెప్పారు. ఈ విషయంలో పెదపూడి మండల ప్రజల అభీష్టం మేరకు ముందుకువెళతానని, తనను కలిసిన పెదపూడి మండల ప్రతినిధుల బృందానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఘనంగా శ్రావణ మంగళవారం పూజలు


కొంకుదురు బుడతల మామిడి వద్ద రేవులో గౌరీదేవికి పూజలు చేస్తున్న మహిళలు

బిక్కవోలు: శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకొని మండలంలోని వివిధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జామున మహిళలు కాలువలకు వెళ్లి స్నానాలు చేశారు. సాముహిక కుంకుమ పూజలు, మంగళ గౌరీ వ్రతం నిర్వహించారు. బిక్కవోలు, బలభద్రపురం, కొమరిపాలెం, పందలపాక గౌరీశంకరులు, కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి వార్ల ఆలయాల వద్ద ఉన్న స్నానాల రేవులోను కొంకుదురు బుడతల మామిడి వద్ద త్రిముఖలింగేశ్వరుని ఆలయం వద్ద గల పుష్కరిణి వద్ద శ్రావణ మాసం మొదటి మంగళవారం కావడంతో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని ముత్తయిదువలను సాయంత్రం ఇళ్లకు ఆహ్వానించి వాయనాలు అందించారు.

జోరుగా ఆటల పోటీలు


పందలపాకలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలోని శ్రీ పడాల పెద్దపుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్గత ఆటల పోటీలు జోరుగా సాగుతున్నాయి. మంగళవారం సీనియర్స్ బాలుర కబడ్డీ, బాల బాలికలకు చెస్ క్రీడా పోటీలు నిర్వహించారు. చెస్ క్రీడలో సీనియర్స్ బాలుర విభాగంలో విన్నర్‌గా వై.హేమంత్, రన్నర్‌గా భువన తేజ నిలిచారు. బాలుర జూనియర్స్ విభాగంలో విన్నర్‌గా జె.ధనుష్, రన్నర్‌గా కె.సూర్య నిలిచారు. బాలికల సీనియర్స్ విభాగంలో జి.విమల శ్రీ విన్నర్‌గా, పి.లీలా స్వాతి రన్నర్‌గా, జూనియర్స్ విభాగంలో బి.చాందిని విన్నర్‌గా, జి సువర్ణ రన్నర్‌గా నిలిచారు. వీరికి క్రీడా దినోత్సవం నాడు బహుమతులు అందిస్తారని పిడి దార్వంపూడి యువరాజారెడ్డి తెలిపారు. ఇన్‌చార్జి హెచ్ఎం టి.జయకృష్ణారెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కొనాల సత్తి రాజు, ఉపాధ్యాయులు పోటీలను పర్యవేక్షించారు.

మెగా రక్తదాన శిబిరం


జి.మామిడాడలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న ప్రతినిధులు

పెదపూడి: యువత రక్తదానం చేసి ప్రాణాపాయస్థితిలో ఉన్న వారిని ఆదుకోడానికి రక్తదానం చేయాలని కాకినాడ రెడ్‌క్రాస్ చైర్మన్ రామారావు అన్నారు. మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా జి.మామిడాడ గ్రామంలో లయన్స్‌క్లబ్, చిరంజీవి యువత అధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం మంగళవారం నిర్వహించారు. రక్త దాన శిబిరం అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. చిరంజీవి యువత ప్రతినిధి రావాడ నాగు, క్లబ్ ప్రతినిధులు మండ రాజారెడ్డి, ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి, వీరబాబు, సబ్బెళ్ల మోహన్‌రెడ్డి, ఛత్రపతి శివాజీ పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు భూమిపూజ

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నూతనంగా నిర్మించనున్న పలు అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి భూమిపూజ చేస్తారని పంచాయతీరాజ్ జేఈ కమ్మసత్తి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ ఆవరణలో అభివృద్ధి పనులకు రూ. 59.80 లక్షలు మంజూరయ్యాయని వీటిలో రూ. 50 లక్షలతో బీపీహెచ్ యూనిట్ భవనం, రూ. 9.80 లక్షలతో ఆరు కోవిడ్ షెడ్లు నిర్మించనున్నట్టు చెప్పారు.

మిర్తిపాడులో ఫ్యామిలీ డాక్టర్


ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మేఘన

సీతానగరం: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మిర్తిపాడులో బొబ్బిల్లంక పీహెచ్‌సీ డాక్టర్ కేజే మేఘన 70 మందికి వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికీ పరీక్షలు జరిపి, మందులు పంపిణీ చేశారు. మంచంపై ఉన్న రోగుల ఇంటికి వెళ్లి వైద్యం చేశారు. ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు వైద్య పరీక్ష నిర్వహించారు. వారిలో ఐదుగురు విద్యార్థులకు రక్తహీతన ఉన్నట్లు గుర్తించారు. వారు వాడాల్సిన మందులను ప్రధానోపాధ్యాయుడికి అందించారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, పిల్లల బరువు చూసి, వారికి అవసరమైన మందులను అందించారు. బంగారు కొండ కార్యక్రమంలో బాల మిత్రలు దత్తత తీసుకున్న పిల్లల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శైలజ, సచివాలయ ఏఎన్ఎం కుమారి, ఆశావర్కర్లు నిర్మల, జయలక్ష్మి, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

అధ్యక్ష, కార్యదర్శుల నియామకం

రాజానగరం: నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో భాగంగా వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలైన యువజన విభాగాలకు అధ్యక్ష, కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులను స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా మంగళవారం ప్రకటించారు. యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా చీంద్రం శ్రీహరి వర్మ (కోరుకొండ), ప్రధాన కార్యదర్శిగా గుడ్ల వినయ్ కుమార్ (తోకాడ), కార్యదర్శులుగా బండి నారాయుడు (దివాన్ చెరువు), గద్దె వీరన్నబాబు (పురుషోత్తపట్నం), సంయుక్త కార్యదర్శులుగా కొల్లి చిరంజీవి (మునికూడలి), చింతల గంగాధర్ (నల్గొండ)ను నియమించారు. అలాగే నియోజకవర్గ పార్టీ యువజన విభాగానికి అధ్యక్షుడిగా అయ్యల రమేష్ (కూనవరం), కోరుకొండ మండలానికి ఉల్లి ఘణబాబు (జంబూపట్నం), రాజానగరం మండలానికి పిల్లా లక్ష్మీనారాయణ (పాలచర్ల), సీతానగరం మండలానికి కోల శ్రీను (సీతానగరం) నియమితులయ్యారు.

26న సామాజిక తనిఖీ ప్రజావేదిక

గోకవరం: మండలంలోని నిర్వహించిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక ఈ నెల 26న స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పద్మజ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోకవరం మండలంలో గత ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకూ జరిగిన ఉపాధి పనులపై తుది నివేదికను ప్రజా వేదికలో అందజేస్తారన్నారు.